# పూతన

కంసుడు తన మంత్రులు చెప్పిన విధంగా శిశుహత్యలతో కనిపించిన శిశువునల్లా నిర్మూలిస్తూ పోతున్నాడు. ఆ ప్రయత్నానికి సిద్ధహస్తురాలు, బాల ఘాతకి అయిన పూతనకు ఈ కార్యాన్ని అప్పగించారు. పల్లె పల్లెకు తిరుగుతూ, ఇంటింటికీ పోయి ఎక్కడ శిశువు కనపడితే అక్కడికక్కడే మట్టు పెట్టమని పూతనకి రాజాజ్ఞ జారీ అయ్యింది.

అలా ఆ ఆజ్ఞని శిరసావహించి, కనిపించిన శిశువునల్లా చంపుతూ చివరకి గోకులం చేరింది. నందుడి ఇంటి సమీపానికి రాగానే దాని చెవులకి శిశురోదనలు వినపడ్డాయి. వెంటనే తన కామరూప విద్యతో సర్వాంగ సుందర స్త్రీ మూర్తిగా వేషం ధరించి నందుడి ఇంట్లోకి వచ్చి చూసింది.

అక్కడ మన చిన్ని కృష్ణుడు ఉయ్యాలలో ఊగుతూ ఆటలు ఆడుకుంటున్నాడు. ఏదో అలికిడి కావటంతో యశోద అక్కడికి వచ్చి ఈ పూతనని చూసి "ఎవరమ్మా నువ్వు ? ఇక్కడికి తారట్లాడుతున్నావు, ఏం కావాలి నీకు?" అని అడిగింది. దానికి పూతన " అమ్మా , నేను కూడా బాలింతనే, నా బిడ్డ లేడు కనక మీ ఈ చిన్నారి బిడ్డలో నా బిడ్డని చూసుకుని సంతోషపడదాము అని వచ్చాను" అంది.యశోదమ్మ పాపం అమాయకురాలు అవ్వటం వల్ల అది నిజమే అనుకుని నమ్మి కృష్ణుడిని ఆ పూతన దగ్గర వదిలి తన పని పూర్తి చేసుకోవటానికి లోపలికి వెళ్ళింది.

ఇక పూతన ,"అహా, భలే సమయం దొరికింది" అని తన పాలిండ్ల నిండా కాలకూట విషం పూసుకుని చిన్ని కృష్ణుడిని పాలు పట్టటానికి తన ఒడిలోకి తీసుకుంది.



Vamsi M Maganti www.maganti.org contact@maganti.org

PDF created with pdfFactory trial version www.pdffactory.com

చిన్ని కృష్ణుడు కాళ్ళు ఊపుతూ, చేతులు ఊపుతూ, బోసి నవ్వులతో గుక్క మీద గుక్క పాలు తాగుతూనే ఉన్నాడు. పూతన "ఇదేమి వింత, ఇంత కాలకూట విషం కూడా పని చెయ్యట్లేదు" అని బాల కృష్ణుడితో "ఇక చాలు, తాగింది చాలు, వదులు" అని గట్టిగా వదిలించుకుందామని చూస్తే కృష్ణుడు వదిలి పెడితేనా ? అలా ఒక్కో గుక్కతో ఒక్కో ప్రాణాన్ని హరించి వేసాడు.

పూతన చావు కేక పెట్టి హరీమంది. వెంటనే దాని కామరూపం పోయి నిజ రాక్షస రూపం బయటపడింది. పూతన అరచిన అరుపులకి అటు యశోద, ఇటు రోహిణి, గోపాలురు, గోపికలు అందరు పరుగున వచ్చి చూడగా ఏముంది ? ఆ భయంకరమైన రాక్షసి శరీరం మీద బాల కృష్ణుడు నవ్వుతూ ఆడుకుంటూ కనపడ్డాడు. అందరూ ఆశ్చర్యపోయారు...

అదర్రా పిల్లలూ - పూతన అనే రాక్షసిని మన కృష్ణ భగవానుడు ఎలా మట్టుపెట్టాడో ఇప్పుడు తెలిసిందా?



Keywords: gOpala krishNuDi lIlalu, bAla krishNuDi lIlalu, rAkshasi poothana, pUtana, rakkasi , rAkAsi pUtana, chinni kRshNuDu, cinni krishNuDu



Vamsi M Maganti www.maganti.org contact@maganti.org

PDF created with pdfFactory trial version www.pdffactory.com